RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 274 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | ఆదివారం, 7 ఏప్రిల్ 2024 | పేజీలు : 4 | వెల : 2/-

# ప్రతి మహిళ ఖాతాలో రూ. లక్ష

## 'నారీ న్యాయ్' దేశ ముఖ చిత్రాన్ని మారుస్తుంది

## మోదీ వచ్చాక పేదలు మరింత నిరుపేదలయ్యారు..



తుక్కుగూడ: నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత దేశంలోని పేదలు మరింత నిరుపేదలయ్యారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపణలు చేశారు. ప్రధాని మోదీ కేవలం కార్పొరేట్ వ్యక్తులకు మాత్రమే రుణమాఫీ చేశారు గానీ, రైతులకు రుణమాఫీ చేయలేదని ధ్వజమెత్తారు. తెలంగాణలోని తుక్కుగూడలో నిర్వహించిన జనజాతర సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సభ సందర్భంగా న్యాయపత్రం పేరిట మేనిఫెస్టో విడుదల చేసిన రాహుల్ గాంధీ.. తాను మేనిఫెస్టో రిలీజ్ చేయడానికే వచ్చానని చెప్పారు. కొన్ని రోజుల క్రితం ఇక్కడే తమ గ్యారెంటీలను విడుదల చేశామని.. ప్రజల గొంతుని వినిపించేలా తాజా మేనిఫెస్టోని సిద్ధం చేశామని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను తప్పకుండా నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే తెలంగాణలో 30వేల ఉద్యోగాలను తమ కాంగ్రెస్ ప్రభుత్వం భర్తీ చేసిందని.. మరికొన్ని ఉద్యోగాలను త్వరలోనే భర్తీ చేయబోతున్నామని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దేశ ప్రజల మనసులోని మాటలే తమ మేనిఫెస్టోలో ఉన్నాయని.. తామిస్తున్న ఐదు గ్యారెంటీలు తమ మేనిఫెస్టోకి ఆత్మలాంటివని చెప్పారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని.. వారికి ప్రత్యేక్ష శిక్షణ ఇస్తామని.. అన్ని రంగాల్లోని నిరుద్యోగులకు సంవత్సరానికి రూ. 1 లక్ష చొప్పున స్టైఫండ్‌తో ట్రైనింగ్ ఇప్పిస్తామని మాటిచ్చారు. ఉద్యోగాలు చేసే మహిళలు.. ఆఫీసులో, ఇంట్లో కలిపి రెండు ఉద్యోగాలు చేస్తున్నారని ప్రశంసించారు. సంవత్సరానికి ప్రతి పేద మహిళకు రూ. 1 లక్ష ఇస్తామని, ఆ డబ్బులను నేరుగా బ్యాంకుల్లో వేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో తరహాలోనే దేశంలోనూ కులగణన చేస్తామని, కులగణన చేస్తే అన్ని విషయాలు బయటపడతాయని వెల్లడించారు. దేశంలో ప్రతిరోజూ 30 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ సిఫార్సుల మేరకు.. పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని మాటిచ్చారు. అలాగే.. జాతీయ ఉ పాధి హామీ పథకం కింద కార్మికులకు కనీసం వేతనం రోజుకి రూ. 400 అందిస్తామని చెప్పారు. భారత్‌లోనే ప్రముఖ కంపెనీ ఓనర్లలో ఒక్కరు కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ లేరని.. అన్ని రంగాల్లో వారి భాగస్వామ్యం ఉండాల్సినంత లేదని పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థలో కూడా సర్వే చేసి.. భారత్‌లోని ధనం ఎవరి దగ్గర ఉందో బయటపెడతామని అన్నారు. ప్రజల హక్కులను ప్రజలకు తప్పకుండా అందించి తీరుతామని రాహుల్ గాంధీ ఉద్ఘాటించారు.



తుక్కుగూడలో నిర్వహించిన జనజాతర సభలో రాహుల్‌గాంధీ

**తెలంగాణతో నాకున్నది రాజకీయ సంబంధం కాదు.. రాహుల్ గాంధీ ఆసక్తికర వ్యాఖ్యలు...** తెలంగాణతో తనకున్నది రాజకీయ సంబంధం కాదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. తుక్కుగూడలో శనివారం జరిగిన తెలంగాణ జన జాతర సభకి రాహుల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సభలో కాంగ్రెస్ జాతీయ మేనిఫెస్టో రిలీజ్ చేశారు. అనంతరం రాహుల్ మాట్లాడుతూ.. "తెలంగాణ ప్రజలకు నాకు ఉన్న సంబంధం రాజకీయ సంబంధం కాదు. కుటుంబ సంబంధం. తెలంగాణ ప్రజలు విద్వేషాల బజార్లో ప్రేమ దుకాణాలను తెరిచారు. జీవితాంతం మీకు అందుబాటులో ఉంటానని మాట ఇస్తున్నా. రాష్ట్రం నుంచి చిన్న పిల్లోడు నన్ను పిలిచినా ఇక్కడికి వస్తాను. తెలంగాణ కొత్త రాష్ట్రం. కాంగ్రెస్ పాలనలో దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం. మేడ్ ఇన్ చైనా కంటే.. మేడ్ ఇన్ తెలంగాణ అనే వ్యవస్థగా మారాలి" అని రాహుల్ అన్నారు.



# జూన్ 9న ఢిల్లీలో ఎగిరేది మువ్వన్నెల జెండానే : రేవంత్

హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమిని గెలిపించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. జూన్ 9న దిల్లీలో మువ్వన్నెల జెండా ఎగరాలన్నారు. హైదరాబాద్ తుక్కుగూడలో నిర్వహించిన ' కాంగ్రెస్ జనజాతర' సభలో ఆయన ప్రసంగించారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో భారాసను తుక్కుతుక్కుగా ఎలా ఓడించామో.. కేంద్రంలో భాజపానూ అలాగే ఓడించాలన్నారు. కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలని కోరారు. కార్యకర్తల కష్టం వల్లే రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిందన్నారు. " గుజరాత్ మోడల్‌పై 'వైబ్రెంట్ తెలంగాణ' ఆధిపత్యం చూపిస్తోంది. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ హామీ ఇచ్చారు. పదేళ్లలో మోదీ 20 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా.. కేవలం 7 లక్షల ఉద్యోగాలు ఇచ్చారు. నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా దిల్లీలో రైతులు 17 నెలలు పోరాడారు. ఈ క్రమంలో 750 మంది చని పోయారు. బాధిత కుటుంబాలను మోదీ పరామర్శించలేదు. కేసీఆర్ పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకున్నారు. పదేళ్లలో వందేళ్ల విధ్వంసం సృష్టించారు. ఏం మాట్లాడినా చూస్తూ ఊరుకుంటా అని కేసీఆర్ అనుకుంటున్నారు. అలా ఊరుకోవడానికి నేను జానారెడ్డిని కాదు.. రేవంత్‌రెడ్డిని. ఎలాబడితే అలా మాట్లాడితే కేసీఆర్‌ను జైలులో పెడతాం. ఆయనకు చర్లపల్లి జైల్లో డబుల్‌బెడ్ రూమ్ ఇల్లు కట్టిస్తాం. ఆయన కాలు విరిగింది. కూతురు జైలుకెళ్లారని జాలి చూపించాం. దిల్లీ నుంచి రాష్ట్రానికి నిధులు కావాలంటే.. 14 మంది ఎంపీలను గెలిపించండి" అని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.





## తెలంగాణ బోర్డర్‌లో ఎన్‌కౌంటర్.. ముగ్గురు మావోయిస్టులు మృతి

ములుగు: తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందినట్టు తెలుస్తోంది. ఎన్‌కౌంటర్ సందర్భంగా ఒక ఏకే-47 గన్, పేలుడు పదార్థా లను పోలీసులు, భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. వివరాల ప్రకారం. ములుగు జిల్లా వెంకటాపురంలోని కర్రెగుట్ట ప్రాంతంలో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య శనివారం ఉదయం ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందినట్టు సమాచారం. అనంతరం, ఘటనా స్థలంలో ఏకే-47 సహా మరో మూడు తుపాకులను, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన గురించి మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

# నమ్మించి నట్టేట ముంచారు



## అధికారం చేపట్టిన నాలుగు నెలల్లోనే రైతులకు ఈ దుస్థితి

## రేవంత్ సర్కార్‌పై నిప్పులు చెరిగిన కేటీఆర్

రాజన్న సిరిసిల్ల : తెలంగాణలో వ్యవసాయ సంక్షోభం నెలకొందని.. ఇది బాధాకరమైన పరిస్థితి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లోనే రైతులకు ఇలాంటి దుస్థితి రావడానికి సీఎం రేవంత్ రెడ్డి సర్కారే అని కేటీఆర్ నిప్పులు చెరిగారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించిన రైతుదీక్షలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఎర్రటి ఎండల్లో కేసీ ఆర్ రైతుల దగ్గరికి వెళ్లి భరోసా ఇచ్చారు. కేసీఆర్ బాటలో బీఆర్ఎస్ శ్రేణులు నేడు దీక్షలు చేస్తున్నారు. కాంగ్రెస్ హామీలు నమ్మి ప్రజలు మోసపోయారు. పాలిచ్చే బర్రెను పంపించి దున్నపోతును తెచ్చుకున్నామని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఎలక్షన్ కోడ్ వచ్చిందని సీఎం, మంత్రులు చావుకబురు చెబుతున్నారు. పాలన తన చేతుల్లో లేదని సీఎం రేవంత్ అనడం సిగ్గు చేటు. రేవంత్‌కు చిత్తశుద్ధి ఉంటే రైతులు ముం దుకు రావాలి. పంటలకు బోనస్ ఇస్తామని ఈసీకి రేవంత్ లేఖ రాయాలి. మేం కూడా మద్దతిస్తాం.. మీ తీరుగా ఎక్కడా అడ్డుకోం. పంటలకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇవ్వాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**రైతు బంధు కోసం పెట్టిన డబ్బులు ఎక్కడ..?** : మంత్రులకు తెలివుందా.. లేదా..? వర్షాలు ఎక్కువ పడి పంటలు మునిగిపోయాయని మంత్రి శ్రీధర్ బాబు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పుడు వర్షాలు పడలేదని శ్రీధర్ బాబు అంటున్నారు. ఎన్నికల ముందు రైతుబంధు కోసం రూ. 7 వేల కోట్లు సిద్ధంగా పెట్టాం. రైతుబంధు ఇవ్వొద్దని గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఆపింది. రైతు బంధు కోసం పెట్టిన డబ్బులు ఏమయ్యాయో చెప్పాలి. తెలంగాణకు నీళ్లు రావాలంటే ఎత్తిపోతలే మార్గం. అందుకే.. కాళేశ్వరం ప్రాజెక్టులో అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి బ్యారేజీలు నిర్మించాం. భారీ మోటార్లు పెట్టి గోదావరి నీళ్లు ఎత్తిపోశాం. ఇవాళ కూడా గోదావరిలో 2 వేల క్యూసెక్కుల నీళ్లు పోతున్నాయ్. ఎర్రటి ఎండల్లో కూడా చెరువులు మత్తళ్లు దుంకినయ్. ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు. 300 పిల్లర్లు ఉన్న బ్యారేజీలో 2 పిల్లర్లు కుంగినయ్. కేసీఆర్‌ను బద్నాం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తుంది. కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం కొట్టుకుపోయిందని దుష్ప్రచారం చేస్తున్నారు. యూట్యూబ్‌లో వచ్చే తప్పుడు వార్తలు చూసి ఆగం కావొద్దు. కేసీఆర్ వస్తున్నారని అన్నారం, సుందిళ్ల నీళ్లు వదిలారు. హరీశ్‌రావు హెచ్చరిస్తే కూడవెల్లి వాగుకు నీళ్లు ఇచ్చారు. ఇన్నాళ్లు నీళ్లు ఉన్నా కూడా ఇవ్వలేదని అర్థమైంది కదా..! అని కేటీఆర్ పేర్కొన్నారు.

**మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి ....** కాంగ్రెస్ మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. డిసెంబర్ 9న రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని మోసం చేశారు. రుణమాఫీని సీరియస్‌గా తీసుకోవద్దని రేవంత్ అంటున్నారు. రైతుబంధు రూ. 15 వేలు ఇస్తామని కాంగ్రెస్ మోసం చేసింది. వరికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తామని ఇవ్వడం లేదు. రుణమాఫీ అయినోళ్లు, బోనస్ వచ్చినోళ్లు కాంగ్రెస్‌కు ఓటు వేయండి. కాంగ్రెస్ మోసాలు ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలి. కృష్ణానది ప్రాంతంలో కూడా కరువు పరిస్థితులు వచ్చాయి. సాగర్‌లో నీళ్లున్నా కూడా పంటలకు నీళ్లు ఇవ్వలేదు. మిషన్ భగీరథ అప్పగించినా నీళ్లిచ్చే తెలివి కాంగ్రెస్‌కు లేదు. వండిన అన్నం వడ్డించే తెలివి కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని కేటీఆర్ ధ్వజమెత్తారు.

**రేవంత్ మొగోడైతే రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలి :** ప్రతి కొనుగోలు కేంద్రానికి వెళ్లి రూ. 500 బోనస్‌పై నిలదీద్దాం. ఎలక్షన్ కోడ్ ఉందంటే అయిపోయినంక ఇస్తామని రేవంత్ మాటివ్వాలి. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను ప్రజలకు వివరించాలి. ప్రభుత్వాన్ని కూలగొడుతామని రేవంత్ రెడ్డి ఆగమాగం అవుతున్నాడు. రేవంత్ మొగోడైతే రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలి. రూ. 500 బోనస్ ఇవ్వాలి. ఆసరా పెన్షన్ రూ. 4 వేలు ఇవ్వాలి. ఆడబిడ్డలకు నెలకు రూ. 2,500 ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## కచ్చతీవు.. మళ్లీ గెల్లిన శ్రీలంక!

దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. అన్ని పార్టీలు ప్రచారంలో తలమునకలై ఉన్నాయి. విమర్శలు, ప్రతివిమర్శలు, దూషణలు, వాగ్బాణాలు చోటు చేసుకుంటున్నాయి. ఎన్నో ఏళ్ల క్రితం జరిగిపోయిన విషయాలను కూడా ఇప్పుడు ప్రస్తావిస్తూ కొత్త చర్చకు ఆయా పార్టీల నేతలు తావిస్తున్నారు. తాజాగా భారత్, శ్రీలంక మధ్యలో హిందూ మహాసముద్రంలోని రామేశ్వరం దీవికి అతి సమీపంలో ఉన్న కచ్చతీవు వ్యవహారం ఇప్పుడు ముదిరిపాకాన పడుతోంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ తన తమిళనాడు ప్రచారంలో భాగంగా కచ్చతీవును అంశాన్ని లాగడం, ఈ దీవిని 1974లో ఇందిరాగాంధీ ప్రభుత్వమే శ్రీలంకకు ఇచ్చిందంటూ తీవ్ర విమర్శలు చేయడం తెలిసిందే. తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై సమాచార హక్కు చట్టం ద్వారా కచ్చతీవుపై సమాచారం తీసుకోగా 1974లో ప్రధానిగా ఉన్న ఇందిరాగాంధీ.. అప్పటికి భారత్ లో ఉన్న కచ్చతీవును శ్రీలంకకు అప్పగించారని వెల్లడైంది. దీంతో ఈ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచారం సందర్భంగా తీవ్ర విమర్శలను ఎక్కుపెట్టారు. మరోవైపు కాంగ్రెస్ కూడా దీటుగా బదులిస్తోంది. మరి బంగ్లాదేశ్ తో సరిహద్దు ఒప్పందం సందర్భంగా 111 భారత్ ప్రాంతాలను బంగ్లాదేశ్ కు ఎందుకిచ్చారని మోదీని నిలదీస్తోంది. ఈ నేపథ్యంలో విదేశాంగ మంత్రి జైశంకర్ కూడా కచ్చతీవు వ్యవహారంపై హాట్ కామెంట్స్ చేశారు. కచ్చతీవు కేవలం ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆకస్మాత్తుగా తెరమీదకొచ్చిన అంశం కాదని తెలిపారు. పార్లమెంటు, కేంద్రం, తమిళనాడు ప్రభుత్వాల మధ్య ఈ అంశంపై ఎన్నో ఏళ్లుగా చర్చ జరుగుతూనే ఉందన్నారు. కచ్చతీవు వ్యవహారంపై తమిళనాడు ప్రభుత్వానికి 21 సార్లు తాను జవాబు ఇచ్చానని వెల్లడించారు. అప్పటి ప్రధానులు భారత భూభాగాలపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ దుస్థితి దాపురించిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో కచ్చతీవపై శ్రీలంక మౌనం వీడింది. దీనిపై తాజాగా శ్రీలంక మత్స్య శాఖ మంత్రి డగ్లస్ దేవానంద స్పందించారు. కచ్చతీవును భారత్ తిరిగి స్వాధీనం చేసుకోవాలనే డిమాండ్లకు ఎలాంటి ఆధారమూ లేదన్నారు. ప్రస్తుతం భారత్ లో ఎన్నికల సమయమని.. అందువల్ల కచ్చతీవు లాంటి ప్రకటనలు రావడం సహజమేనని డగ్లస్ దేవానంద కొట్టిపారేశారు. 1974 నాటి ఒప్పందం ప్రకారం.. కచ్చతీవును శ్రీలంకకు అప్పగించినా, ఇరుదేశాల మత్స్యకారులు ప్రాదేశిక జలాల్లో రెండువైపులా చేపలు పట్టుకోవచ్చని ఆయన గుర్తు చేశారు. 1976లో సైతం ఇంకో ఒప్పందం కుదిరిందన్నారు. 1976లో కుదిరిన ఒప్పందం ప్రకారం సముద్రంలో సరిహద్దులు విభజించారని డగ్లస్ దేవానంద తెలిపారు. ఒక దేశం జాలరులు మరొకరి జలాల్లో చేపల పట్టడం నిషిద్ధమని వివరించారు. కచ్చతీవును శ్రీలంకకు ఇచ్చినందుకు ప్రతిఫలంగా కన్యాకుమారికి దిగువన వెస్ట్ బ్యాంకుతో పిలవబడుతున్న మరో ప్రాంతం భారత్ కు దక్కిందన్నారు. వెస్ట్ బ్యాంక్.. కచ్చతీవు కంటే 80 రెట్లు పెద్దదన్నారు. ఈ నేపథ్యంలో కచ్చతీవు వ్యవహారంపై శ్రీలంక మంత్రి చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ గా మారాయి. ఆయన వ్యాఖ్యలపై భారత్ ఎలా స్పందిస్తుదనేది ఆసక్తికరంగా మారింది.

# హెచ్చరిక బోర్డులు ఏమవుతున్నాయ్!


ముందు


తర్వాత

పెద్దపల్లి: రోజురోజుకూ పట్టణీకరణ పెరుగుతుండటంతో మున్సిపాలిటీల శివారు ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలకు డిమాండ్ పెరిగింది. ఇదే అదనుగా వ్యవసాయ భూములను స్థిరాస్తి వెంచర్లుగా మార్చి అడ్డగోలు ధరలకు విక్రయిస్తున్నారు. పెద్దపల్లి పట్టణ శివారులో వెలిసిన వెంచర్ల వద్ద పంచాయతీ అధికారులు ఏర్పాటు చేస్తున్న హెచ్చరిక బోర్డులు రెండు, మూడు రోజులకే మాయమవుతుండటం చర్చనీయాంశంగా మారింది. 'ఈ వెంచరుకు డీటీసీపీ(డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ కంట్రీ ప్లానింగ్) అనుమతి లభించిందా! నిజంగానే ప్రభుత్వ అనుమతి అంత త్వరగా వస్తుందా..!' అని చూసినవాళ్లు ముక్కున వేలేసుకుంటున్నారు. స్థిరాస్తి వ్యాపారులు మాయాజాలం సృష్టిస్తున్నారా..! వారికి మున్సిపల్, పంచాయతీ అధికారులు ఎందుకు సహకరిస్తున్నారు? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అసలు జిల్లాలో డీటీసీపీ ఎన్ని వెంచర్లకు అనుమతి ఇచ్చింది? వాటి వివరాలను ఎందుకు బహిరంగపరచడం లేదు? అన్న అనుమానాలు కూడా సాధారణ ప్రజలను వెంటాడుతున్నాయి.

హంగులతో బురిడీ

పురపాలికల పరిధిలో ఇళ్ల స్థలాల విక్రయాలపై అధికారుల నిఘా పెరగడంతో శివారు పంచాయతీల పరిధిలో అక్రమ వెంచర్లు వెలుస్తున్నాయి. ׀ పెద్దపల్లి మండలం పెద్దకల్వల, పెద్దబొంకూర్, కొత్తపల్లి, చీకురాయి, గౌరెడ్డిపేట, రాఘవపూర్, అప్పన్నపేట, నిమ్మనపల్లి, నిట్టూరు గ్రామాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది.

ఇళ్ల స్థలాలు త్వరగా అమ్ముడుపోయేందుకు వెంచర్లలో రహదారులను అందంగా నిర్మించి, ఆకట్టుకునే రంగులతో హద్దురాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ׀గ్రామాల్లో వెంచర్ల ఏర్పాటుకు సంబంధిత ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకుంటే సరిపోతుంది. ఎలాంటి నిబంధనలను పాటించాల్సిన అవసరం లేదు. పది శాతం స్థలాలను పంచాయతీలకు ఇవ్వాల్సిన పని లేదు. ׀ ఇక ప్లాట్లు అమ్మేందుకు వందల సంఖ్యలో దళారులు ఉండనే ఉన్నారు. ఒకే ప్లాటుకు ఇద్దరు, ముగ్గురు దళారులు కలిసి, కొనుగోలుదారును బోల్తా కొట్టిస్తున్నారు.

బహిరంగంగా జరుగుతున్న అక్రమ స్థిరాస్తి వ్యాపారాన్ని నిలువరించడంలో పంచాయతీ అధికారులు విఫలమవుతున్నారు. ఇతర ఒత్తిళ్లతో ఏర్పాటు చేసే బోర్డులను ఎవరైనా తొలగిస్తే ప్రశ్నించడం మానేశారు.

పెద్దపల్లిలో రెడ్డి ఫంక్షన్‌హాల్‌కు వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన స్థిరాస్తి వెంచరుకు అనుమతి లేదని, దాన్ని అక్రమ వెంచరుగా పేర్కొంటూ ఇటీవల రాఘవాపూర్ పంచాయతీ అధికారులు సర్వే నంబర్లు సహా బోర్డు ఏర్పాటు చేశారు. కాగా వారం తిరగకముందే వెంచరు వద్ద బోర్డు మాయమైపోయింది.

నిబంధనల్లో లొసుగులతో..డీటీసీపీ నిబంధనల ప్రకారం లే అవుట్ నిబంధనలు వర్తించాలంటే కనీసం ఎకరం, అంతకంటే ఎక్కువ స్థలంలో వెంచరు ఏర్పాటు చేయాలి. అందులో రహదారులతో పాటు ఇతర మౌలిక వసతులను నిర్మించాలి. ఎకరం కంటే తక్కువ స్థలంలో ఏర్పాటు చేసే వెంచర్లకు లే అవుట్ నిబంధనలు వర్తించకపోవడంతో పెద్దపల్లి, రామగుండం పురపాలికల శివారు ప్రాంతాల్లో అనేకం వెలుస్తున్నాయి. 2021లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎల్ఆర్ఎస్ పథకం కింద నమోదు చేసుకున్న స్థలాలకు డీటీసీపీ నిబంధనలను మినహాయించారు. దీంతో అప్పట్లో ఎకరాలను గజాల్లోకి మార్చి ఎల్ఆర్ఎస్ పథకం కింద నమోదు చేసుకున్న వారికి ఎక్కువ ప్రయోజనం దక్కుతోంది.బాధ్యులపై చర్యలు తీసుకుంటాం జిల్లాలో అనుమతి లేని స్థిరాస్తి వెంచర్లపై చర్యలు తీసుకుంటున్నాం. అలాంటి చోట్ల ప్లాట్లు కొనకూడద ని పెద్ద బోర్డులు ఏర్పాటు చేశాం. పెద్దపల్లి పట్టణ శివారులో ఈ పరిస్థితి ఎక్కువగా ఉండటంతో దాదాపు అన్ని ప్రాంతాల్లో బోర్డులు వేశాం. వాటిని తొలగించిన అంశం మా దృష్టికి రాలేదు. విచారణ జరిపి బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. తొలగించిన బోర్డుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి, హద్దురాళ్లను కూడా తొలగిస్తాం.ఆశాలత, జిల్లా పంచాయతీ అధికారి

# మన మామిడి.. మధుర'మండీ'



సత్తుపల్లి : ఉమ్మడి ఖమ్మం జిల్లా మామిడి కాయలకు ప్రసిద్ధి. మన మధురఫలాలకు డిమాండూ ఎక్కువే.. ఏటా ఇక్కడి నుంచి హైదరాబాద్‌తోపాటు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. ప్రస్తుత సీజన్ మామిడి కోతలు ప్రారంభమయ్యాయి. అదేవిధంగా మండీలు కూడా సిద్ధమయ్యాయి. ఇప్పటికే పలు మండీల నుంచి కొద్దిమొత్తంలో రవాణా కూడా జరుగుతోంది. దిగుబడి తక్కువ రాగా ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. నాణ్యమైన కాయలు టన్ను రూ.55 వేల నుంచి రూ.75వేలు పలుకుతున్నాయి. మంగుకాయలు టన్ను రూ.25వేల నుంచి రూ.50వేల వరకు కొనుగోలు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో సాగు విస్తీర్ణం

ఖమ్మం జిల్లాలో 31,604 ఎకరాల్లో మామిడి తోటలుండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 12వేల ఎకరాల విస్తీర్ణంలో సాగుచేశారు. సత్తుపల్లి నియోజకవర్గంలో సత్తుపల్లి మండలంలో 1516 ఎకరాలు, వేంసూరు 6740, పెనుబల్లి 6394, కల్లూరు 3522, తల్లాడ మండలంలో 1972 ఎకరాల్లో సాగవుతోంది.

పెట్టుబడి పెరిగి... దిగుబడి తగ్గి ఈ ఏడాది మామిడి తోటలకు నల్లి తీవ్రంగా వ్యాపించింది. దీంతో తోటలకు రైతులు అధికసార్లు పురుగుమందులను పిచికారీ చేయాల్సి వచ్చింది. వర్షాభావం, నల్లి కారణంగా మామిడిపూత నిలువలేదు. ఫలితంగా మామిడి రైతుల ఆశలు అడియాశలయ్యాయి. గత సంవత్సరం మామిడి చెట్లకు 2నుంచి 4సార్లు మందులను పిచికారీ చేస్తే, ఈ ఏడాది పది విడతలకు మించింది. గతేడాది ఎకరాకు 6నుంచి 8టన్నుల దిదుబడి వస్తే, ప్రస్తుతం 2నుంచి 3టన్నులు రావడం కూడా గగనమేనని రైతులు వాపోతున్నారు. ఈ సీజన్‌లో పెట్టుబడి పెరిగి దిగుబడి తగ్గి నష్టపోయామని ఆవేదన చెందుతున్నారు.

ఇప్పటికే ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

ప్రస్తుతం తల్లాడ, కల్లూరు మండీల నుంచి దిల్లీ, గుజరాత్, మధ్యప్రదేశ్(ఇండోర్), ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు మామిడికాయలను ఎగుమతి చేశారు. తల్లాడ, కల్లూరు, వేంసూరు, ఖమ్మంలలో తక్కువ సంఖ్యలో మండీలు ప్రారంభమయ్యాయి. వీటితోపాటు సత్తుపల్లి, పెనుబల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ, కొత్తగూడెంలలో త్వరలో పూర్తిస్థాయిలో ప్రారంభమవుతాయని వ్యాపారులు, నిర్వాహకులు తెలిపారు. ఏపీలోని కృష్ణా, ఎన్టీఆర్, ఆగిరిపల్లి, నూజివీడు, విస్సన్నపేట, రెడ్డిగూడెం, పుత్రేల, తిరువూరు, మైలవరం నుంచి రైతులు మామిడికాయలను సత్తుపల్లి పరిసర మండీలకు తీసుకొచ్చి అమ్ముతుంటారు.

ఊపందుకున్న కొనుగోలు కేంద్రాలుమామిడి రైతులకు ఇబ్బందుల్లేకుండా వ్యాపారులు మండీలు(కొనుగోలు కేంద్రాలు) ఏర్పాటు చేస్తున్నారు. రైతులు తమ తోటల్లోని మామిడికాయలను కోసి ట్రాక్టర్లు, మినీవ్యాన్‌ల ద్వారా మండీలకు తరలిస్తుంటారు. వివిధ రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు మండీల దగ్గరకు వచ్చి కాయలను కొనుగోలు చేసి ప్రత్యేక లారీల ద్వారా తమ రాష్ట్రాలకు పంపిస్తున్నారు. అక్కడ వాటిని మాగబెట్టి దుకాణాల్లో పండ్లుగా విక్రయిస్తారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో సత్తుపల్లి నియోజకవర్గంలోనే ఎక్కువ కేంద్రాలున్నాయి. దళారుల బెడద లేకుండా రైతులు నేరుగా ఇక్కడి వ్యాపారులకే విక్రయిస్తున్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, వేంసూరు మండలాల్లో ప్రస్తుతం మామిడి కోతలు జరుగుతున్నాయి. కోసిన కాయలను ఇటీవల ప్రారంభమైన మండీలకు తరలిస్తున్నారు.

# ప్రతిపాదనల్లోనే ప్రాజెక్టులు

నారాయణఖేడ్ : ఖేడ్ నియోజకవర్గం ప్రధానంగా సాగునీటి కల్పన విషయంలో జిల్లాలోనే అట్టడుగున ఉంది. అత్యధిక శాతం వర్షాధారంపైనే పంటలు పండిస్తారు. ఇక్కడి భూములు ఎత్తుపల్లాలుగా, గుట్టలుగా ఉండటంతో సాగునీటి వనరులైన కుంటలు, చెరువులు, ప్రాజెక్టుల నిర్మాణాలకు అనుకూలంగా ఉన్నాయి. వీటి నిర్మాణాల విషయంలో పాలకులు చొరవ చూపితే జిల్లా వాసులకు ఎంతో ప్రయోజనం ఉంటుంది.

వరప్రదాయిని అయిన మంజీరా నది ఖేడ్ నియోజకవర్గంలోని మనూరు మండలం గౌడ్‌గాంజన్ వాడ వద్ద జిల్లాలోకి ప్రవేశించి జిల్లావ్యాప్తంగా 98 కి.మీ.ల మేర ప్రవహిస్తోంది. మంజీరా తలాపునే ప్రవహిస్తున్నా సాగునీటి పరంగా ఎలాంటి ప్రయోజనం లేదు. వర్షపునీటికి అడ్డుకట్ట వేసి ప్రాజెక్టులను నిర్మించి తద్వారా సాగుకు నీటిని అందించాలనే ప్రతిపాదనలు దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. పలు చెరువుల నిర్మాణానికి గతంలో పలుమార్లు నిధులు సైతం మంజూరైనా స్థలసేకరణ పేరుతో తీవ్ర జాప్యం చేయడంతో వెనక్కి మళ్లిపోయాయి.

కొలిక్కిరాని స్థల సేకరణ కంగ్టి మండలం వంగ్దాల్ శివారులోని పెద్దవాగుపై ప్రాజెక్టు నిర్మించడానికి గతంలో చిన్న నీటి పారుదల అభివృద్ధి కింద రూ.1.40 కోట్లు మంజూరు చేశారు. సర్వే సైతం చేయించారు. అయితే తమ భూములు ముంపునకు గురవుతాయని భావించి యజమానులు విముఖత చూపారు. అయినా అధికారులు వారికి అవగాహన కల్పించకపోవడంతో సర్వే మినహా ఒక్క అడుగూ ముందుకు పడలేదు. నియోజక వర్గంలోని దూద్‌గొండ, రుద్రారం, పైడిపల్లి, మోర్గీ, ఇరక్‌పల్లి, ఎనక్‌పల్లి, పంచగామ తదితర ప్రాంతాల్లో సైతం గుట్టలు అధికంగా ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో చెరువులు, ప్రాజెక్టులు నిర్మించాలనే ప్రతిపాదనలు దశాబ్దాలుగా ఉన్నా మోక్షం మాత్రం లభించడం లేదు.

పిప్రి ప్రాజెక్టుకు సర్వే చేసినా..

ఖేడ్ మండలం పిప్రి శివారులో ఎత్తయిన గుట్టలు అధికంగా ఉన్నాయి. వర్షాలు కురిస్తే నీరు భారీగా దిగువకు ప్రవహించి కాల్వల గుండా వృథాగా పోతోంది. ఇక్కడి పరిస్థితుల దృష్ట్యా రెండు గుట్టల మధ్య ప్రాజెక్టు నిర్మించి సాగుకు నీటిని అందించాలనే ప్రతిపాదన దశాబ్దాలుగా ఉంది. ఇక్కడ ప్రాజెక్టు నిర్మిస్తే వందలాది ఎకరాలకు సాగునీరు అందుతుంది. గతంలో చిన్నస్థాయి ప్రాజెక్టు నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేశారు. అప్పట్లోనే సర్వే కూడా నిర్వహించారు. ఆ తర్వాత నుంచి ఇప్పటి వరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

# విచ్చలవిడిగా బోర్ల తవ్వకం

గజ్వేల్: పర్యావరణాన్ని కాపాడి, భూగర్భ జలమట్టాలు పడిపోకుండా తీసుకునే జాగ్రత్తల్లో భాగంగా ప్రభుత్వం వాల్టా చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ నిబంధనల ప్రకారం అనుమతి లేనిదే ఇసుక తీయకూడదు, బోర్లు తవ్వకూడదు. ఒకవేళ తప్పని పరిస్థితి వస్తే బోరు బావికి కనీసం 100 మీటర్ల దూరంలో మాత్రమే కొత్త బోరు వేయాలని నిబంధనలు చెబుతున్నాయి. కానీ జిల్లాలో పరిస్థితి చూస్తే వాల్టా చట్టం ఉందా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఎందుకంటే వాగుల్లో ఇసుక తీయటం ఆగటం లేదు. విచ్చలవిడిగా బోర్లు తవ్వకం నిలవడం లేదు.

మరింత లోతుకు తవ్వి : పంటలు ఎండిపోతున్నాయనే కారణంగా రైతులు బోర్లు వేస్తుండగా, ఇళ్ల నిర్మాణాల కోసం యజమానులు, వెంచర్లు, స్థిరాస్తి వ్యాపారం చేసేందుకు రియల్టర్లు ఇష్టారీతిన బోర్లు తవ్వుతున్నారు. జిల్లాలో రోజుకు పాతిక సంఖ్యలో బోర్లు వేస్తున్నారు. ఇసుక తీయటం, బోర్లు వేయటం కారణంగా వాతావరణ సమతుల్యం దెబ్బతిని అనర్థాలకు దారి తీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ యాసంగిలో దాదాపు 3 లక్షల ఎకరాల మేర వరి పంట సాగైంది. ప్రస్తుతం వరి పంట గొలుసు కట్టి గింజ పాలు



తాగుతోంది. ఈ దశలో అధికంగా నీటి అవసరం ఉండటంతో భూగర్భనీటి మట్టం తగ్గిపోయి చాలా చోట్ల బోర్లు తట్టి పోస్తున్నాయి. కొన్నిచోట్ల పూర్తిగా ఎండిపోవడంతో రైతులు మళ్లీ కొత్తగా బోరు బావులు తవ్వుతున్నారు. కొన్నిచోట్ల పాత వాటిని మరింత లోతుకు తవ్విస్తున్నారు.సంఖ్య భారీగా పెరిగి.. : జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్-ప్రజ్ఞాపూర్, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల పురపాలికలతో పాటు మండల కేంద్రాల్లో జోరుగా ఇళ్ల నిర్మాణాలు సాగుతున్నాయి. ప్రతి ఇంటికి కొత్తగా బోరు వేసిన తరువాతనే పనులు ప్రారంభిస్తున్నారు. వెంచర్లు ఏర్పాటు చేస్తున్న రియల్టర్లు రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం తోపాటు వెంచర్లలో అభివృద్ధి పనుల కోసం బోర్లు తవ్విస్తున్నారు. ఫలితంగా జిల్లాలో బోర్ల సంఖ్య భారీగా పెరిగిపోతోంది. జిల్లాలో సాగు కోసం దాదాపు 160 లక్షల బోర్లు వినియోగంలో ఉన్నట్లు అంచనా. ఇటీవల కొత్తగా సుమారు వేయి వరకు బోర్లు తవ్వించినట్లు అంచనా. ఇళ్లలోని బోర్లు పరిశీలిస్తే బల్దియాల్లోనే 1 లక్షకు పైగా వినియోగిస్తున్నట్లు అధికారులు భావిస్తున్నారు. దీనికి తోడు నెలకు సుమారు 150 వరకు కొత్త బోర్లు వేస్తున్నట్లు తెలుస్తుంది. ఇలా ఇష్టారీతిన బోర్లు వేయటం వల్ల రానున్న రోజుల్లో మరింత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

# ఆట.. అటకెక్కినట్టే!

మెదక్ : గ్రామీణ క్రీడాకారుల ప్రతిభ వెలికితీసేందుకు.. వారు సాధన చేసేందుకు గత ప్రభుత్వ హయాంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. ప్రతి పంచాయతీ, పురపాలికల్లోని వార్డులో వీటిని అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. అయితే చాలా చోట్ల గ్రామాలకు దూరంగా, ఖాళీ స్థలాల్లో బోర్డులను ఏర్పాటు చేసి మమ అన్పించారు. ఫలితంగా కోట్లాది రూపాయలు బూడిదలో పోసిన పన్నీరైంది.

తూతు మంత్రంగా...: పాపన్నపేట మండలంలో 35 పంచాయతీల్లో మైదానాలను ఏర్పాటు చేశారు. వాటిల్లో బోర్డుతో పాటు వ్యాయామం చేసేందుకు సింగిల్ బార్, డబుల్ బార్ ఏర్పాటు చేశారు. స్థలం తక్కువ ఉన్న చోట్ల వాలీబాల్ కోర్టులు ఏర్పాటు చేశారు. పాపన్నపేట, యూసుఫ్‌పేట, మిన్‌పూర్, దౌలాపూర్ గ్రామాల్లో పాఠశాల ఆవరణలో వీటిని ఏర్పాటు చేశారు. చాలా చోట్ల అనువుగాని ప్రాంతంలో ఉండడంతో నిరుపయోగంగా మారాయి.పరికరాలు లేక..: తూప్రాన్ మండలంలో 14 గ్రామాల్లో ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల స్థలాలు సరిపడా లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాల, ఇతర ఖాళీ స్థలాల వద్ద బోర్డులు ఏర్పాటు చేశారు. ఎక్కడా పరికరాల ఏర్పాటు చేయలేదు. చాలా చోట్ల సూచిక బోర్డులు, రెండు ఇనుప పైపులను బిగించి వదిలేశారు. మల్కాపూర్, వట్టూర్‌ల్లో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో బోర్డులను ఏర్పాటు చేసి వదిలేశారు. వెంకటాయపల్లి శివారులో లోతట్టు ప్రాంతంలో, కిష్టాపూర్‌లో గ్రామానికి దూరంగా బోర్డు ఏర్పాటు చేశారు.పొదల మధ్య..: చేగుంట మండలం మక్కరాజుపేటలో ఊరికి దూరంగా ఏర్పాటు చేశారు. అందులో రాళ్లు ముళ్ల పొదలే ఉన్నాయి. పరికరాలను పంపిణీ చేసినా, అవి ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి. పులిమామిడి, రుక్మాపూర్‌లో గ్రాంలోనే కేవలం గుంట విస్తీర్ణంలో మాత్రమే ఏర్పాటు చేశారు. ఆటలు ఆడే సౌకర్యంలేదు. చేగుంట, నార్సింగి మండలాల్లో చాలా చోట్ల పాఠశాలల ఆవరణలో ఏర్పాటు చేసినా ఉపయోగంలో లేవు.

కుంటలో...: టేక్మాల్ మండల పరిధి కోరంపల్లిలో కుంటలో ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో నీళ్లు నిలిచి ఉంటాయి.

దీంతో వినియోగంలోకి రావడం లేదు. బోర్డు మాత్రమే ఏర్పాటు చేయగా, పరికరాలను బిగించలేదు. పెద్దశంకరంపేట మండలం రామోజీపల్లిలో అనువుగా లేని ప్రాంతంలో ఏర్పాటు చేశారు.

అసంపూర్తిగా..: మెదక్ పట్టణం 32 వార్డుల్లో ఏర్పాటు చేయాలి. కేవలం 12చోట్ల ఏర్పాటు చేశారు. ఇందులో పూర్తిస్థాయిలో ఎనిమిది ఉండగా, మిగిలినవి అసంపూర్తిగా ఉన్నాయి. మిగతా వార్డుల్లో స్థలం లేకపోవడంతో ఏర్పాటు చేయడం లేదు. ప్రస్తుతం ఉన్న ప్రాంగణాలకు పరికరాలు అందజేశారు.

గ్రామాలకు దూరంగా...: కౌడిపల్లి, రామాయంపేట, నిజాంపేట మండలాల్లో చాలా వరకు ఊరికి దూరంగా ఏర్పాటు చేయడం వల్ల నిరుపయోగంగా ఉన్నాయి. వాటిలో ధాన్యం ఆరబెడుతున్నారు. హవేలిఘనపూర్ మండలం సుల్తాన్‌పూర్‌లో అదే పరిస్థితి. ఇక్కడా ధాన్యం ఆరబోశారు. మాసాయిపేట మండలం నాగ్సానపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

నిర్వహణపై ఆదేశాలు లేవు:ప్రాంగణాల నిర్వహణపై ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం నుంచి ఆటల కిట్లు రావడంతో అన్ని మండలాలు, మున్సిపాలిటీలకు వాటిని పంపిణీ చేశాం. ప్రాంగణాలు ఉన్న చోట కిట్ ఇవ్వాలని గతంలో చెప్పారు .నాగరాజు, జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి

# 24 గంటల పర్యవేక్షణ..

## పటిష్ఠ నిఘా

కరీంనగర్ : కరీంనగర్ జిల్లా: పాలనాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూంలో ఎనిమిది మంది సిబ్బంది 24 గంటలపాటు మూడు షిఫ్టులలో విధులు నిర్వహిస్తున్నారు. 1950 నంబర్‌కు డయల్ చేస్తే కంట్రోల్ రూంలో ఉన్న సిబ్బందికి సమాచారం అందుతుంది. డయల్ చేసిన వ్యక్తి ఫిర్యాదును ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేసి అధికారులకు సమాచారం ఇచ్చి పరిష్కారానికి దోహదపడతారు.లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఓటరు ఎలాంటి సమాచారం పొందాలన్నా, ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయాలన్నా తక్షణమే స్పందించే విధంగా జిల్లా కేంద్రంలో కంట్రోల్‌రూంలు ఏర్పాటు చేశారు. ఓటరు నమోదు, చిరునామా మార్పు, ప్రచార అనుమతులు, కోడ్ ఉల్లంఘన తీరు పరిశీలన, వాహనాలలో అధిక నగదు, మద్యం వంటి వాటిని తీసుకెళ్లే వాటి పర్యవేక్షణ వంటి పలు అంశాలను 24 గంటలపాటు పరిశీలించి ఎన్నికల అధికారులకు



తెలియజేసేందుకు వీటిని ఏర్పాటు చేశారు. ఈ సేవలు ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు 24 గంటలపాటు కొనసాగుతాయి. మూడు షిఫ్టులలో సిబ్బంది విధులు నిర్వహిస్తారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లో కంట్రోల్ రూం సేవలు అందుబాటులోకి వచ్చాయి. 1950 నంబర్‌కు డయల్ చేస్తే ఉమ్మడి జిల్లాలోని సంబంధిత జిల్లాలోని కంట్రోల్ రూంకు వెళ్తుంది. అక్కడ ఫోన్ లిఫ్ట్ చేయకపోతే ప్రధాన ఎన్నికల కమిషన్ కార్యాలయానికి కనెక్ట్ అవుతుంది.

తనిఖీలు నిరంతరంగా చేస్తూ..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జిల్లా సరిహద్దులు, ఇతర ప్రాంతాలలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుంటారు. నిబంధనలకు విరుద్ధంగా రూ.50 వేలకు పైబడి నగదు, పెద్ద మొత్తంలో మద్యం సీసాలు తీసుకెళ్తే వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేస్తుంటారు. జిల్లా కేంద్రంలోని కంట్రోల్ రూంలో నిరంతరం ఇద్దరు సిబ్బంది మానిటరింగ్ చేస్తూ వివరాలు నమోదు చేస్తారు.

సీవిజిల్‌లో ఫిర్యాదు పార్టీ ప్రచార సిబ్బంది గోడపత్రికలు అనుమతిలేని ప్రదేశాలలో అంటించినా.. మైకుల మోతలు వినిపించినా ఇతర ఉల్లంఘనలకు పాల్పడితే వాటి ఫొటోలు తీసి సీవిజిల్ యాప్ ద్వారా పంపాలి. వెంటనే దానిని ఇక్కడి సిబ్బంది సంబంధిత ప్రాంత ఎన్నికల అధికారులకు పంపిస్తారు. తక్షణమే స్పందించి కోడ్ నిబంధనలకు పాల్పడే వారిపై చర్యలు చేపడతారు. ఉల్లంఘనలు జరిగితే 1950 నంబర్‌కు డయల్ చేస్తే తగిన సమాచారం ఇస్తారు. ఇప్పటివరకు 285 కాల్స్ వస్తే 197 పరిష్కరించినట్లు, మిగిలినవి పరిశీలనలో ఉన్నాయని అధికార వర్గాలు తెలిపాయి.

మూడు షిఫ్టుల్లో విధులు..

ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు.

మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు.

రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు.

# చెత్త ఎత్తలేక.. మరమ్మతు చేయలేక!

కరీంనగర్: స్వచ్ఛతలో ఆదర్శంగా నిలిచిన పల్లెల్లో ఇప్పుడు చెత్త సమస్య నెలకొంటోంది.. ఇటీవల సర్పంచుల పదవీ కాలం ముగియడం.. ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్న తరుణంలో ఇంటింటి చెత్త సేకరణకు వాహనాలు లేకపోవడం ఇబ్బంది పెడుతోంది.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,218 గ్రామ పంచాయతీల్లో దాదాపుగా అన్ని చోట్లా మూడు చక్రాల సైకిళ్లతోపాటు తోపుడు వాహనాలు మూలకు చేరాయి. దీంతో పారిశుద్ధ్య కార్మికులకు పేరుకున్న వ్యర్థాలను తరలించడం సమస్యగా మారుతోంది. పల్లె ప్రగతి సమయంలో దండిగా ఉపయోగించిన ఈ వాహనాలు ఇప్పుడు చాలాచోట్ల పంచాయతీ కార్యాలయాల వద్దా.. ఊరి బయట వృథాగా కనిపిస్తున్నాయి. శిథిలావస్థకు చేరినవి కొన్నయితే.. కనీసం మరమ్మతు చేయకుండా వదిలేసినవి మరికొన్ని ఉన్నాయి.

మూణ్నాళ్ల ముచ్చటగా…రూ.20 వేల నుంచి రూ.25 వేలను ఒక్కో ట్రై సైకిల్‌కు వెచ్చించి దాదాపుగా అయిదేళ్ల కిందట వీటిని స్వచ్ఛభారత్ కార్యక్రమం ముమ్మరంగా నడుస్తున్న సమయంలో పంచాయతీలు కొనుగోలు చేశాయి. ఇలా ఒక్కో గ్రామంలో 3–5 వాహనాల చొప్పున మొత్తంగా 4 వేలకుపైగా ట్రైసైకిళ్లను తీసుకొచ్చారు. వీటి కోసం సుమారుగా రూ. 8 కోట్లకుపైగా ప్రజాధనాన్ని వెచ్చించారు. ఇవేకాకుండా తోపుడు వాహనాలు చెత్త సేకరణ కోసం వినియోగించారు. కొన్నాళ్లు పనిచేసిన ఇవి మరమ్మతులకు నోచుకుంటే కొందరు సర్పంచులు చొరవ చూపించి బాగు చేయించగా.. చాలామంది వీటికి ఖర్చు పెట్టడం వృథా అని వదిలేశారు. ఇలా నాలుగు జిల్లాల పరిధిలో ప్రస్తుతం 10 శాతం కూడా ఉపయోగించడం లేదు. వాస్తవానికి ప్రతి గ్రామంలో ఊరి బయట డంపింగ్ యార్డులను ఏర్పాటు చేసి అక్కడి వరకు వ్యర్థాలను తీసుకెళ్లాలనే ఆశయం వీటి సేవలు లేక ఊరూరా చతికిలపడుతోంది. మరో వైపు గ్రామ పంచాయతీలకు ఇచ్చిన ట్రాక్టర్లలో దాదాపుగా 30 శాతం వాహనాలను కూడా చెత్త సేకరణకు ఉపయోగించడం లేదు. దీంతో ఊరవతల రూ.లక్షలతో నిర్మించిన డంపింగ్ యార్డులు అలంకార ప్రాయంగా మారాయి.

పట్టణాల్లో ఇదే తీరు..కరీంనగర్, రామగుండం నగరపాలక సంస్థలతోపాటు మిగతా 14 పురపాలికల్లో చెత్త తరలింపు అనేది బల్దియాలకు సమస్యగా మారుతోంది. ప్రస్తుతం ఈ పట్టణ ప్రాంతాల్లో ట్రాక్టర్లతోపాటు చిన్న ట్రాలీ వాహనాల్ని ఉపయోగిస్తున్నారు. వీటి మరమ్మతుల పరంగా ఆర్థిక భారాన్ని పురపాలిక సంస్థలు మోయాల్సి వస్తోంది. చాలావరకు పాత వాహనాలతో నెట్టుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. కొత్తగా కొన్నవాటితో పాతవి కూడా మూలకు చేరినవి అన్ని చోట్లా కనిపిస్తున్నాయి. బల్దియా వార్షిక బడ్జెట్‌లో పారిశుద్ధ్య నిర్వహణకు దాదాపుగా 25 శాతం ఖర్చు చేస్తుండగా ఇందులో వీటి మరమ్మతుల ఖర్చే అధికంగా ఉంటోంది. ఎప్పటికప్పుడు మరమ్మతు చేయకపోవడంతో ఒక్కసారిగా కుప్పకూలుతున్న పెరుగుతోంది.

# గని ఆదాయం.. ప్రగతి పనులకు ఇంధనం



తాండూరు: జిల్లా గనుల శాఖకు 2023–24 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యానికి మించిన ఆదాయం సమకూరింది. గడచిన మార్చి31తో ఆర్థిక సంవత్సరం ముగిసింది. కొత్త ఆర్థిక సంవత్సరం 2024–25లోకి అడుగు పెట్టడానికి ముందు అధికారులు గతేడాది సమకూరిన ఆదాయంపై ఏప్రిల్ 1న లెక్కలు తీశారు. మొత్తం రూ. 113.46 కోట్ల ఆర్థిక లక్ష్యానికి లీజులు పొందిన 229 గనుల నుంచి రాయల్టీ రూపకంగా రూ. 121.01 కోట్లు సమకూరింది. ఈలెక్కన ప్రభుత్వం విధించిన లక్ష్యంలో రూ. 7.55 కోట్లు అదనంగా వచ్చిందని రికార్డుల్లో నమోదు చేశారు. ఈ మొత్తాన్ని వివిధ అభివృద్ధి పనులకు వెచ్చించనున్నారు.

చిన్న తరహా ఖనిజ తవ్వకాలే ఎక్కువ

జిల్లాలో చిన్న తరహా ఖనిజాల తవ్వకాలే ఎక్కువగా జరిగాయి. నాపరాయి, లేటరైట్, స్టోన్ మెటల్, సుద్ద, ఫైర్‌క్లే, క్వార్ట్జ్, షెల్ వంటి ఖనిజాలను గనుల యజమానులు ఎక్కువగా తవ్వి విక్రయించారు. పెద్దేముల్, మోమిన్‌పేట, నవాబుపేట, బంట్వారం, వికారాబాద్ మండలాల పరిధిలో తవ్విన లేటరైట్‌ను జిల్లాలోని సీసీఐ, ఇండియాసిమెంట్స్, పెన్నా సిమెంట్ కర్మాగారాలకు తరలించారు. మోమిన్‌పేట, ధారూర్, పెద్దేముల్ మండలాల్లో తవ్విన సుద్దను ఎరువుల తయారీ కర్మాగారాలకు, సింగపూరు, మలేషియా దేశాల్లో నూనెశుద్ధి కర్మాగారాలకు తరలించారు.రాయల్టీ వసూలు చేశారు. చిన్నతరహా ఖనిజాల నుంచి రూ. 81.70 కోట్లను సమకూర్చుకోవాలని ప్రభుత్వం లక్ష్యం విధించింది. తవ్వకాలు ఎక్కువగా జరగడం వల్ల నిర్ణీత లక్ష్యం కంటే రూ. 11.34 కోట్ల అదనపు ఆదాయం వచ్చింది.

పెద్దతరహా తవ్వకాలు అంతంతే..

సిమెంటు ఉత్పత్తిలో వినియోగించే పెద్దతరహా ఖనిజమైన సున్నపు రాయి తవ్వకాలు తాండూరు పరిధి గనుల్లో నామమాత్రంగానే జరిగాయి. భవనాలు, వంతెనలు, రహదారుల వంటి నిర్మాణాలు స్తంభించినపుడు కర్మాగారాలు కూడా సున్నపు రాయి తవ్వకాలను చేపట్టలేదు. పెద్దతరహా ఖనిజాల నుంచి రూ. 31.76 కోట్ల ఆదాయాన్ని సాధించాలని ప్రభుత్వం లక్ష్యం విధించింది. కేవలం రూ. 27.96 కోట్లు మాత్రమే సమకూరాయి.

గత 2022–23 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం గనుల శాఖకు ఎలాంటి ఆర్థిక లక్ష్యం విధించ లేదు. పెద్దతరహా ఖనిజాల నుంచి రూ. 30.63 కోట్లు, చిన్న తరహా ఖనిజాల నుంచి రూ. 84.56 కోట్లు సమకూరాయి.

కొత్త సంవత్సర లక్ష్యం నిర్దేశించలేదు

సత్యనారాయణ, గనుల శాఖ సహాయ సంచాలకులు, తాండూరు

జిల్లాలోని గనుల నుంచి రాయల్టీ రూపంలో సమకూరిన నిధిని ప్రభుత్వం వివిధ అభివృద్ధి పనుల కోసం వ్యయం చేస్తుంది. కొత్త ఆర్థిక సంవత్సరంలో గనుల శాఖకు ఇంకా ఆర్థిక లక్ష్యాన్ని విధించలేదు. గడచిన ఆర్థిక సంవత్సరంలో రూ. 106.65 శాతం లక్ష్యాన్ని సాధించాం.

# సైబర్ భద్రత ప్రత్యేక కోర్సుతో నిపుణత





హైదరాబాద్ : చరవాణులు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు వినియోగిస్తున్నప్పుడు సైబర్ నేరస్థులు పంపుతున్న లింకులు.. ప్రమాదకర వైరస్‌ల బారి నుంచి కాపాడుకునేందుకు జేఎన్‌టీయూ హైదరాబాద్ సైబర్ భద్రతపై ప్రత్యేక కోర్సు ప్రవేశపెట్టింది. ఇంజినీరింగ్ విద్యార్థులు, వృత్తినిపుణులు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల అధికారులకు నాలుగు వారాలపాటు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వనుంది. దైనందిన వ్యవహారాల్లో వినియోగించే చరవాణులు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లలో కొత్త ప్రోగ్రామ్‌లు, అప్లికేషన్లను ప్రవేశపెట్టకముందే.. ఆయా ప్రోగ్రామ్‌లు, అప్లికేషన్లలోని లోపాలను గుర్తించి.. అవి వైరస్ దాడులను తట్టుకునేలా కోర్సులో చేరిన వారికి నేర్పించనున్నారు. విదేశాలు, ఐటీ సంస్థల్లో సైబర్ భద్రత పర్యవేక్షణ నిపుణుల కొరత తీవ్రంగా ఉండడంతో జేఎన్‌టీయూ హైదరాబాద్ సైబర్ సెక్యూరిటీ కేంద్రం ప్రత్యేక కోర్సును ప్రవేశపెట్టింది.

వైరస్‌లు, దాడులను ముందే గుర్తిస్తే…

నిత్యావసర వస్తువుల నుంచి ఐపీఎల్ టికెట్ల వరకు ఆన్‌లైన్ ద్వారానే తీసుకుంటున్నాం. కోట్ల మంది వినియోగిస్తున్న యాప్‌లు, ఇతర అప్లికేషన్లు భద్రతపరంగా సురక్షితంగా ఉన్నా.. ఆన్‌లైన్‌లో ఏదైనా వస్తువు కొన్న వెంటనే.. భారీ బహుమతులు, రాయితీలంటూ చరవాణికి, మెయిల్‌కు సంక్షిప్త సందేశాలొస్తున్నాయి. వీటిని క్లిక్ చేస్తే సైబర్ నేరస్థుల బారిన పడినట్టే. ఈ ముప్పు ముందే గుర్తించి కొత్త అప్లికేషన్లు, ప్రోగ్రామ్‌లలో సైబర్ నేరస్థుల బారినపడే అవకాశాలు ఎక్కడున్నాయి?.. తదితర అంశాలను సైబర్ భద్రత కోర్సులో శిక్షణ పొందుతున్న వారికి నేర్పించనున్నారు. జేఎన్‌టీయూ ఆచార్యులతో పాటు సైబర్ భద్రతపై పరిశోధనలు నిర్వహించి నిపుణులతో ఆన్‌లైన్ పాఠాలు చెప్పించనున్నారు.

పరికరాలు.. పనిముట్లతో ప్రయోగాలు

సైబర్ భద్రత కోర్సులో ప్రధానంగా దాడులు, వైరస్‌ల తీవ్రతను గుర్తించడం.. వాటి బారిన పడకుండా ఏఏ చర్యలు చేపట్టాలన్న అంశాలపైనే వృత్తి నిపుణులు శిక్షకులకు బోధించనున్నారు. నాలుగైదు ప్రోగ్రామ్‌లు, అప్లికేషన్లను ప్రయోగాత్మకంగా పరిశీలించి.. వాటిలో వైరస్‌లు, సైబర్ దాడులకు అనుకూలమైనవేవైనా ఉన్నాయా? అని గుర్తించేందుకు సాఫ్ట్‌వేర్ పరికరాలు, పనిముట్లతో అభ్యాసం చేయించనున్నారు. సాంకేతిక పరిభాషలో ఎన్ మ్యాప్, వైర్ షార్క్, మెటా స్ప్లాయిట్, బర్ప్‌సూట్ వంటి పనిముట్లను వినియోగింపజేయనున్నారు. న్యాయపరమైన, నైతిక అంశాలను పరిగణలోకి తీసుకుని వాటిని కూడా పరిశీలించనున్నారు. ఈ కోర్సును ఇప్పటికే కొన్ని ప్రైవేటు, ఐటీ సంస్థలు, విదేశీ విశ్వవిద్యాలయాలు ఆన్‌లైన్ ద్వారా బోధిస్తున్నాయి. కోర్సు పూర్తిచేసిన వారికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి.నిపుణులుగా మార్చాలన్న లక్ష్యంతో..– ఆర్.శ్రీదేవి, సైబర్ భద్రత కేంద్రం, జేఎన్‌టీయూ

విద్యార్థులు, ఆచార్యులు, పరిశోధకులు సైబర్ భద్రత అంశాలపై అవగాహన పెంచుకుని నిపుణులవ్వాలన్న లక్ష్యంతో ప్రత్యేక కోర్సును అందుబాటులోకి తీసుకువచ్చాం. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల అధికారులు, ఉద్యోగులకు ఎంతో ప్రయోజనకరంగా ఉండనుంది. విద్యార్థులకు రూ. 2 వేలు, ఇతరులకు రూ. 3 వేల చొప్పున కోర్సు ఫీజు నిర్ణయించాం. శిక్షణ పూర్తయ్యాక ధ్రువపత్రాలు ఇవ్వనున్నాం.

# అభివృద్ధి పేరిట పైపుల ధ్వంసం

కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో కొన్ని చోట్ల చేపట్టిన అభివృద్ధి పనులు కొత్త సమస్యలకు దారి తీశాయి. ఆరు నెలల కిందట హడావుడిగా ప్రారంభించిన రహదారులు, మురుగుకాలువ పనులు పలు చోట్ల అసంపూర్తిగా ఉన్నాయి. నిర్ణీత గడువులోగా పూర్తి చేయాల్సిన గుత్తేదారులు పత్తా లేకుండా పోవడంతో కాలనీవాసులు నరకయాతన అనుభవిస్తున్నారు. ముఖ్యంగా పైపులైన్లు తొలగించడం, కొత్తవి వేయకపోవడంతో నల్లా నీరు నిలిచిపోయింది. పైగా ఇళ్లల్లో ఉన్న బోర్లు ఎండిపోయి ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడింది.

అధికారులు ఏం చేస్తున్నట్లు?

నగరవ్యాప్తంగా అభివృద్ధి పనులు నిలిచిపోగా కనీసం తాగునీటి సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చూపుతున్నారు. ఎండలు ముదరడంతో అన్ని ప్రాంతాల్లో ఇబ్బందులు పడుతున్నారు. నల్లా కనెక్షన్లు ఉండి కూడా నీరు రాని ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాలకు వచ్చేలా చూడటం లేదు. కనీసం వేసవికాలంలో నీటి అవసరాలు గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాల్సి ఉండగా కనీసం ఆ వైపు దృష్టిసారించడం లేదు.

సీతారాంపూర్‌లోని సూర్యనగర్‌లో గతేడాది అక్టోబరులో మురుగుకాలువ నిర్మించేందుకు ఎడాపెడా తవ్వేశారు. ఇళ్ల నుంచి వచ్చే పైపులు పగిలిపోగా తిరిగి ఆ పనులు చేయకపోవడంతో ఇప్పటివరకు నల్లా నీరు రావడం లేదు. వేసవి తీవ్రం కావడంతో ఉన్న బోర్లు ఎత్తిపోయాయి. పనులు ప్రారంభించిన గుత్తేదారు పత్తా లేకుండా పోగా, కనీసం తాగునీటికి



ఇబ్బందులు రాకుండా చూడాల్సిన నగరపాలక అధికారులు అంటిముట్టనట్లుగా ఉంటున్నారు. మొదట పైపులైనుకు కనెక్షన్ ఇచ్చి నీటి ఎద్దడి తీర్చాలని కోరుతున్నారు.పాతబజారు ప్రాంతంలోని బ్రాహ్మణ వీధిలో రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనుల కోసం పది రోజుల కిందట తవ్వారు. ఆ సమయంలో తాగునీటి పైపులైన్లు ఊడిపోగా తిరిగి కనెక్షన్లు ఇవ్వలేదు. వీధిలో ఉన్న ఇళ్ల ప్రజలకు తాగునీటితోపాటు ఇతర అవసరాలకు నీరు లేకపోవడంతో అల్లాడుతున్నారు. డ్రైనేజీ నిర్మించి క్యూరింగ్ చేయడం లేదు. ఇప్పుడున్న నల్లా కనెక్షన్ల కంటే ఎక్కువ సంఖ్యలో ఇచ్చేందుకు ప్లంబర్ ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. నిధులుండగా గుత్తేదారు నిర్లక్ష్యం చేయడంతో ఆ కాలనీవాసులు నానావస్థలు పడుతున్నారు.

# ఆరోగ్య అస్త్రం.. శత శాతం

పెద్దపల్లి : గర్భిణులు, బాలింతల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో వివిధ కార్యక్రమాలు అమలవుతున్నాయి. కడుపులో నలుసు పడినప్పటి నుంచి ప్రసవం అయ్యే వరకు ఆరోగ్య పరిరక్షణ చర్యలు చేపడుతున్నారు. పుట్టిన బిడ్డతో పాటు బాలింతలకు వ్యాధి నిరోధక టీకాలను ఉచితంగా అందిస్తున్నారు. ముందస్తు టీకాలతో పిల్లలు ఆరోగ్యవంతులుగా ఎదుగుతున్నారు. సర్కారు దవాఖానాల్లో మెరుగైన సేవలతో ఏటికేడు ప్రసవాల సంఖ్య పెరుగుతోంది. గడిచిన మూడేళ్లలో టీకాల పంపిణీలో జిల్లా అగ్రపథంలో దూసుకెళ్తోంది. క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తుండటంతో ఈ ఘనత సాధ్యమవుతోంది.

ఏయే రకాలు అందిస్తున్నారంటే..

ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు వివిధ రకాల టీకాలను ఉచితంగా వేస్తున్నారు. క్షయ వ్యాధి నివారణకు బీసీజీ, పోలియో, కామెర్లు రాకుండా హెపటైటిస్–బి, పెంటా అయిదు రకాలు(కంఠసర్పి, కోరింత దగ్గు, ధనుర్వాతం, కామెర్లు, మెదడు వాపు, న్యూమోనియా), తట్టు నివారణకు మీజిల్స్, రుబెల్లా, అంధత్వం రాకుండా విటమిన్ ఏ తదితర టీకాలు అందిస్తున్నారు. పిల్లలు పుట్టినప్పటి నుంచి కౌమార దశ వరకు విడతల



వారిగా టీకాలు వేస్తున్నారు.

అవగాహన పెంపు

జిల్లాలో 18 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 104 ఉప కేంద్రాలున్నాయి. టీకా పంపిణీ లక్ష్యాలపై వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు అవగాహన కల్పిస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో వేయించుకుంటే పడే ఆర్థిక భారం, ప్రభుత్వ దవాఖానాల్లో ఉచిత సేవలపై వివరిస్తున్నారు. ఆరోగ్య కేంద్రాల్లో విలువైన టీకాలు అందుబాటులో ఉండటంతో ప్రజలు కూడా మొగ్గు చూపుతున్నారు. మండల, జిల్లా స్థాయిల్లో ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండటంతో మెరుగైన ప్రగతి నమోదైంది.

ప్రత్యేక ప్రణాళికతో లక్ష్య సాధన

జిల్లాలో వ్యాధి నిరోధక టీకాల లక్ష్యంపై సిబ్బంది ఊరూరా అవగాహన కల్పిస్తున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అన్ని రకాల టీకాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే అన్ని రకాల సేవలందిస్తున్నాం. ప్రత్యేక ప్రణాళికతో లక్ష్యాలు చేరుకున్నాం.డాక్టర్ ప్రమోద్‌కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి

# ఉద్యోగ నైపుణ్యం.. శిక్షణకు సన్నద్ధం

పెద్దపల్లి: బహుళజాతి సంస్థల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు, పట్టభద్రుల్లో నైపుణ్యం పెంపునకు జిల్లాకేంద్రంలో ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. టాస్క్(తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్) ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే తొలి నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని పెద్దపల్లిలో గత నెలలో ప్రారంభించారు. మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే విజయరమణారావు, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ చేతుల మీదుగా మార్చి 16న పెద్దపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేశారు.జిల్లాలో ప్రత్యేకంగా ప్రభుత్వ భవనాలు అందుబాటులో లేకపోవడం, మౌలిక వసతుల కొరత ఉండటంతో టాస్క్ కేంద్రాన్ని తాత్కాలికంగా మండల పరిషత్తు ఆవరణలోని డీఆర్‌డీఏ టీ సెర్ప్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఐటీ కార్యాలయం మాదిరిగా ఆకట్టుకునే రీతిలో మౌలిక వసతులు కల్పించే దిశగా టాస్క్ నిర్వాహకులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఆకర్షణీయంగా ఉండేలా కార్యాలయాన్ని వివిధ రంగులతో తీర్చిదిద్దుతున్నారు. ఏప్రిల్ రెండో వారం నుంచి ఎంపిక చేసిన విద్యార్థులకు ఆంగ్ల భాషతో పాటు టాస్క్ నిపుణులు సూచించిన తరగతులు నిర్వహిస్తామని ఉమ్మడి కరీంనగర్ జిల్లా టాస్క్ మేనేజర్ గంగాప్రసాద్ పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు.




రాష్ట్రంలోనే తొలి కేంద్రం

అటు సాంకేతిక విద్యాసంస్థలు, ఇటు ఐటీ, పారిశ్రామిక రంగాలను సమన్వయం చేస్తూ నాణ్యమైన మానవ వనరులు అందించేలా టాస్క్ కృషి చేస్తోంది. గతంలో కేవలం సాంకేతిక కళాశాలల్లో ఒక భాగంగానే ఈ కేంద్రాలు సేవలందించాయి. ఈ ఏడాది జనవరిలో జిల్లా పాలనా ప్రాంగణంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రాష్ట్రంలోనే తొలి నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని పెద్దపల్లిలో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన మంత్రి శ్రీధర్‌బాబు, ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను ఆదేశించారు. టాస్క్ ఆధ్వర్యంలో గతంలో కళాశాల వేదికగా ఉద్యోగాలకు అవసరమైన సాంకేతిక, వ్యక్తిగత నైపుణ్యాలను విద్యార్థులకు నేర్పించేవారు. ప్రస్తుతం విద్యార్హతలకు అనుగుణంగా నైపుణ్యంతో పాటు భావ వ్యక్తీకరణ సామర్థ్యాలు నేర్పించేలా చర్యలు చేపట్టారు. రెండు నెలల శిక్షణ అనంతరం జూన్‌లో మొదటి బ్యాచ్‌కు ప్రత్యేక జాబ్‌మేళా నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రంలోనే పైలట్ ప్రాజెక్టు కావడంతో పెద్దపల్లి టాస్క్ కేంద్రంలో పూర్తి స్థాయి వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించారు.

# మొద్దు ప్రభుత్వాన్ని నిద్ర లేపడానికే రైతు దీక్షలు: హరీశ్‌రావు



సంగారెడ్డి: మొద్దు ప్రభుత్వాన్ని నిద్ర లేపడానికే రైతు దీక్షలు చేస్తున్నామని మాజీ మంత్రి , సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సంగారెడ్డిలో నిర్వహించిన భారాస రైతు దీక్షలో ఆయన మాట్లాడారు. వంద రోజుల కాంగ్రెస్ పాలనలో 200 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. "కరెంట్ లేదు, నీళ్లు లేవు, కన్నీళ్లే మిగిలాయి. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు ఇవ్వాలి. చనిపోయిన అన్నదాతల కుటుంబాలకు రూ.20 లక్షలు ఇవ్వాలి. రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి. రైతుబంధు రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12 వేలు ఇవ్వాలి. వరి పండించిన రైతులకు రూ.500 బోనస్ అందించాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రైతులకు మేలు చేసే వరకు భారాస పోరాడుతుందన్నారు.

**వడ్డీతో సహా చెల్లిస్తాం..** మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యలకు హరీశ్‌రావు కౌంటర్ ఇచ్చారు. వేరే పార్టీల ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోబోమని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ చెబుతుంటే.. ఉత్తమ్ మాత్రం భిన్నంగా మాట్లాడుతున్నారని అన్నారు. " మా పార్టీకి చెందిన 25 మంది కాంగ్రెస్‌లోకి చేరుతున్నట్లు ఉత్తమ్ చెబుతున్నారు. కాంగ్రెస్ నేతలు హామీలు అమలు చేసేదాకా వదిలిపెట్టం. కేసీఆర్‌పై మంత్రులు ఇష్టారీతిన మాట్లాడుతున్నారు. రైతు సమస్యలపై మాట్లాడిన ఆయన్ని తిడుతున్నారు. కేసీఆర్ ప్రజల్లోకి వెళ్తే.. వాళ్లకు నిద్ర పట్టడం లేదు. ఐదేళ్ల తర్వాత మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రాదు. ఎన్ని చేయాలో చేయండి.. వడ్డీతో సహా చెల్లిస్తాం" అని హరీశ్‌రావు అన్నారు.

# కేసీఆర్ ఎర్రటి ఎండల్లో.. రేవంత్‌రెడ్డి ఏమో ఐపీఎల్ మ్యాచుల్లో..!



రాజన్న సిరిసిల్ల జిల్లా: మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అరచేతిలో వైకుంఠం చూపెట్టి గెలిచిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శనివారం నాడు రైతు దీక్షకు బీఆర్ఎస్ పిలుపుచ్చింది. ఈ దీక్షలో కేటీఆర్ పాల్గొని మాట్లాడుతూ... రేవంత్ ప్రభుత్వం దున్న పోతుతో సమానమని ఎద్దేవా చేశారు. రైతులకు రూ.500 బోనస్ ఇవ్వమని అడిగితే ఎలక్షన్ కోడ్ ఉందని అంటున్నారన్నారు. చిత్త శుద్ది ఉంటే ఎలక్షన్ కమిషన్‌కు లెటర్ రాయాలని.. తాము కూడా ఉత్తరం ఇస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంలో రెండు పిల్లర్లు రిపేరు చేస్తే తెలంగాణలో కరువు రానే రాదన్నారు. ప్రజలపై ప్రేముంటే ఎన్నికల్లో ఇచ్చినా హామీలను రేవంత్ రెడ్డి నెరవేర్చాలని కోరారు. ప్రతిపక్షంలో ఉన్న కేసీఆర్ ఎర్రటి ఎండలో ప్రజల్లో తిరిగితే.. రేవంత్ రెడ్డి ఐపీఎల్ మ్యాచులు చూస్తున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి గుంపు మేస్త్రి, ప్రధానమంత్రి తాపీ మేస్త్రి అని సెటైర్లు గుప్పించారు.




హైదరాబాద్: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి షాకింగ్ న్యూస్ ఒకటి చెప్పారు. అదే జరిగితే తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ ఖేల్ ఖతమవుతుంది. ఇంతకీ ఆ విషయం ఏంటంటారా? త్వరలో 25 మంది టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరబోతున్నారని వెల్లడించారు. కేసీఆర్ అహంకరపూరిత వైఖరి వల్లే ఆ పార్టీకి ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. నిన్న కరీంనగర్ లో కేసీఆర్ పిచ్చి పిచ్చిగా మాట్లాడారన్నారు. పదేళ్లలో ఇరిగేషన్ మీద లక్షల కోట్ల దోపిడీ చేశారన్నారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను బొంద పెడితే 104 మంది ఎమ్మెల్యేల నుంచి 39కి పడిపోయారని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌కు తెలివి తక్కువ పొగరు ఎక్కువ అని ఉత్తమ్ ఎద్దేవా చేశారు. ఎక్కువ తక్కువ మాట్లాడితే ఎవ్వరూ పడరని ఉత్తమ్ పేర్కొన్నారు. 'ప్రపంచంలో నువ్వొక్కడివే మేధావివా?' అని కేసీఆర్‌ను నిలదీశారు. మేడిగడ్డ కుంగింది అన్నప్పుడు ఎడా పన్నావ్ అని ప్రశ్నించారు. 'మాకు అభివృద్ధి చేయడం తెలుసు.. నీకు కమిషన్లు తీసుకోవడం తెలుసు' అని ఉత్తమ్ విమర్శించారు. అయితే బీఆర్ఎస్ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 39 సీట్లు గెలుచుకుంది. ఈ 39 మందిలో ఒకరు మరణించగా.. మరికొందరు ఇప్పటికే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇప్పుడు ఉత్తమ్ చెప్పినట్టుగా 25 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరితే కేసీఆర్ కుటుంబం మినహా దాదాపు కీలక నేతలెవరూ ఆ పార్టీలో లేనట్టే. అయితే ఉత్తమ్ మాటల్లో నిజమెంతుందనేది తెలియాల్సి ఉంది.

# ఊహాగానాలకు చెక్.. మళ్లీ మార్చేస్తామంటూ ఎర్రబెల్లి సంచలనం..

జనగామ : మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. నేడు పాలకుర్తి మండల కేంద్రం రాజీవ్ చౌరస్తాలో ఎండిన పంటలకు మద్దతుగా రైతుల మహా ధర్నాలో ఎర్రబెల్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారాయి. అవేంటంటే.. బీఆర్ఎస్‌ను తిరిగి టీఆర్ఎస్‌గా మారుస్తామని ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్‌పైనే పోటీ చేస్తానని ఎర్రబెల్లి దయాకర్ రావు స్పష్టం చేశారు. భారత రాష్ట్ర సమితి పేరును మళ్లీ తెలంగాణ రాష్ట్ర సమితిగా మారుతుందా? ఈ దిశగా బీఆర్ఎస్ అధినాయకత్వం కసరత్తు చేస్తోందంటూ కొంత కాలంగా ఊహాగానాలు వినవస్తున్నాయి.

ఎర్రబెల్లి వ్యాఖ్యలతో అది నిజమేనని తేలింది. బీఆర్ఎసగా పేరు మార్చాక తెలంగాణలో అధికారం కోల్పోవడం, రాష్ట్రంలో రోజురోజుకూ పార్టీ గ్రాఫ్ తగ్గుతున్న నేపథ్యంలో పేరు మార్పుపై అధిష్ఠానం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. "ఉద్యమ పార్టీగా ప్రారంభమైన టీఆర్ఎసను.. బీఆర్ఎసగా మార్చాలని ఎవరు చెప్పారు? తెలంగాణ ఆత్మగా చెప్పుకొనే పార్టీ పేరును ఎవరినీ అడగకుండా ఎలా మార్చారు? పేరు మార్చడం వల్లే కొంతకాలంగా పార్టీ గ్రాఫ్ పడిపోతూ వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయానికి కారణం కూడా అదే" అంటూ ఇటీవల బీఆర్ఎస్ పార్టీ నిర్వహించే సమావేశాల్లో కింది స్థాయి కార్యకర్తల నుంచి ఓ మోస్తరు నాయకుల వరకు అధిష్ఠానాన్ని నిలదీస్తూ వస్తున్నారు. దీంతో జనానికి పార్టీ దూరం కావడానికి ఇదే ప్రధాన కారణమని భావించిన అధిష్ఠానం.. పేరు మార్పే శరణ్యమని భావిస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో ప్రత్యేక గుర్తింపును, అధికారాన్ని తెచ్చిపెట్టిన టీఆర్ఎస్ పేరునే జనంలోకి తీసుకువెళ్లేలా.. బీఆర్ఎసను టీఆర్ఎసగా మార్చేందుకు అనువైన అంశాలపై ఆ పార్టీ కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.


ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194





# రాష్ట్రంలో సంక్షోభం సృష్టించిందే భారాస: తెలంగాణ మంత్రులు

హైదరాబాద్: తెలంగాణకు భారాస అధ్యక్షుడు కేసీఆర్ చేసిన ద్రోహానికి వెయ్యి గజాల లోతులో పాతిపెట్టాలని మంత్రి జూపల్లి కృష్ణారావు ఘాటుగా విమర్శించారు. కరీంనగర్ పర్యటన సందర్భంగా ప్రభుత్వంపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రులు మండిపడ్డారు. గత ప్రభుత్వ అస్తవ్యస్త పాలన వల్లే రాష్ట్రంలో కరవు వచ్చిందని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో మిషన్ భగీరథ పేరుతో రూ. వేల కోట్ల కుంభకోణం జరిగిందన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. చేనేత కార్మికులకు తీవ్ర ద్రోహం చేసిందే కేసీఆర్ అని, మంత్రి పొన్నం ఆరోపించారు. రాష్ట్రంలో సంక్షోభ పరిస్థితులను సృష్టించిందే భారాస ప్రభుత్వమని అన్నారు. సిరిసిల్ల జిల్లా చేనేత కార్మికులను ఇంటికి భోజనానికి పిలిపించి చెప్పిన ఒక్క మాటైనా అమలు చేయలేదని విమర్శించారు. కమిషన్ల కోసమే గత ప్రభుత్వం ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్ట్ డిజైన్ మార్చిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. వరద కాల్వలు ఎండిపోవడానికి అప్పటి భారాస ప్రభుత్వమే కారణమని, నిపుణుల అభిప్రాయం మేరకే ప్రాజెక్టులపై ముందుకెళ్తామని అన్నారు. కృష్ణా జలాలను ఏపీ సీఎం జగన్ తీసుకుపోతుంటే కేసీఆర్ ఏం చేశారని ప్రశ్నించారు. ఆయన పాలనలోనే కృష్ణా జలాలను అక్రమంగా ఏపీకి తరలించారని ఆరోపించారు. "రూ.90 వేల కోట్లు ఖర్చుపెట్టి ప్రాజెక్టు కట్టలేకపోయావు. కేసీఆర్ చేసిన దోపిడీకి వేరే దేశాల్లో ఉరిశిక్ష వేస్తారు. ఉన్న నీటిని రైతులకు ఏవిధంగా ఉపయోగించాలో వారం వారం సమీక్షిస్తున్నాం. వారి ఇబ్బందులను తగ్గించడానికి ప్రయత్నిస్తున్నాం" అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. 26 మంది భారాస ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. కేసీఆర్ పొగరు వల్లే భారాసకు అతి తక్కువ సీట్లు వచ్చాయని విమర్శించారు. ఆయన మాటలను ప్రజలు ఇంకా నమ్మే పరిస్థితి లేదన్నారు.

# సికింద్రాబాద్ కంటోన్మెంట్ అభ్యర్థిని ప్రకటించిన కాంగ్రెస్



ఢిల్లీ, ఏప్రిల్ 6: సికింద్రాబాద్ కంటోన్మెంట్ అభ్యర్థి పేరును కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించింది. కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా నారాయణ శ్రీ గణేష్ పేరును కాంగ్రెస్ హైకమాండ్ అధికారికంగా అనౌన్స్ చేసింది. ఈ మేరకు శనివారం ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ కే.సీ వేణుగోపాల్ ప్రెస్‌నోట్‌ను విడుదల చేశారు. గణేష్ ఇటీవల బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. కంటోన్మెంట్ అభ్యర్థిపై అనేక చర్చల అనంతరం చివరకు గణేష్ పేరునే కాంగ్రెస్ అధిష్టానం మొగ్గు చూపింది. సిట్టింగ్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతితో కంటోన్మెంట్ స్థానం ఖాళీ అయిన విషయం తెలిసిందే. కాగా.. బీఆర్ఎస్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే ల్యాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మరణించడంతో అక్కడ ఉపఎన్నిక అనివార్యమైంది. మే 13న కంటోన్మెంట్ ఉపఎన్నిక జరుగనుంది. ఎన్నికలకు సర్వం సిద్ధమవుతున్న తరుణంలో ఆయా పార్టీలు కంటోన్మెంట్‌లో పోటీ చేయబోయే అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించాయి. ఇటు అధికార కాంగ్రెస్ పార్టీ కూడా ఈసారి కంటోన్మెంట్ ఉప ఎన్నికలో విజయం సాధించాలని ఉద్దేశంతోనే ముందుకు సాగుతోంది. కంటోన్మెంట్‌లో పోటీ చేయబోయే అభ్యర్థి ఎంపికపై దృష్టి పెట్టి కాంగ్రెస్.. శ్రీ గణేష్ పేరును అధికారికంగా ప్రకటించింది. కంటోన్మెంట్ కోసం కాంగ్రెస్ వ్యూహకర్త సునీల్ కనుగొలు నాలుగు సార్లు సర్వేలు చేయగా.. కంటోన్మెంట్‌లో అరవ మాల సామాజిక వర్గం ఓట్లు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. శ్రీ గణేష్ అరవ మాల సామాజికవర్గం కావడంతో హస్తం నేతలు అతడి వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. గ్రేటర్ పరిధిలో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యే లేనందున కంటోన్మెంట్ ఉపఎన్నికను కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.

# గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ వ్యూహం.. ఆ నియోజకవర్గాలకు..



హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికలకు బీఆర్ఎస్ పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతోంది. ఈసారి ఎలాగైనా పెద్ద మొత్తంలో స్థానాలను కైవసం చేసుకునేలా ప్లాన్ చేస్తోంది. ఈ క్రమంలోనే జనాల్లోకి పెద్దగా రాని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సైతం ప్రస్తుతం జనాల్లోనే ఉంటున్నారు. ఇక ఇప్పటికే లోక్‌సభ ఎన్నికల కోసం అభ్యర్థులను ప్రకటించిన బీఆర్ఎస్ పార్టీ తాజాగా పార్లమెంట్ నియోజకవర్గాలకు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఎన్నికల సమన్వయకర్తలను నియమించింది,

**మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తలు :** మేడ్చల్- శంబిపూర్ రాజు, ఎమ్మెల్సీ, మల్కాజిగిరి- నందికంటి శ్రీధర్, మాజీ చైర్మన్, కుత్బుల్లాపూర్ - గొట్టిముక్కల వెంగళరావు, పార్టీ సీనియర్ నాయకులు, కూకట్‌పల్లి- బేతి రెడ్డి సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఉప్పల్- జహంగీర్ పాష, పార్టీ రాష్ట్ర సెక్రెటరీ, సికింద్రాబాద్ కంటోన్మెంట్- రావుల శ్రీధర్ రెడ్డి, మాజీ చైర్మన్, ఎల్బీనగర్ - బొగ్గరపు దయానంద్ గుప్త, ఎమ్మెల్సీ.

**చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ అసెంబ్లీల సమన్వయకర్తలు..** మహేశ్వరం- కనకమామిడి స్వామి గౌడ్- శాసనమండలి మాజీ చైర్మన్, రాజేంద్రనగర్- పుట్టం పురుషోత్తం రావు, పార్టీ సీనియర్ నాయకులు, శేరిలింగంపల్లి- కె నవీన్ కుమార్, ఎమ్మెల్సీ, చేవెళ్ల- నాగేందర్ గౌడ్, పార్టీ సెక్రటరీ, పరిగి- గట్టు రామచంద్రరావు, పార్టీ సీనియర్ నాయకులు, వికారాబాద్- పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, సీనియర్ నాయకులు, తాండూర్- బైండ్ల విజయ్ కుమార్, జడ్పీ వైస్ చైర్మన్.

# 400 సీట్లతో కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వస్తాం: కిషన్‌రెడ్డి



హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లతో కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వస్తామని కేంద్ర మంత్రి, భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని కార్యాలయంలో జెండా ఎగురవేసి మాట్లాడారు. రాష్ట్రంలో భారాస రోజురోజుకు కనుమరుగవుతోందన్నారు. హామీలను నెరవేర్చే స్థితిలో కాంగ్రెస్ లేదని విమర్శించారు. ఆ పార్టీ ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పతనం ప్రారంభమైందని చెప్పారు. తెలంగాణలో పదికి పైగా ఎంపీ స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. భాజపాతోనే అభివృద్ధి సాధ్యమని కిషన్‌రెడ్డి తెలిపారు. "ప్రధాని నరేంద్ర మోదీ విశ్వ నాయకుడిగా గుర్తింపు పొందారు. ప్రపంచమంతా భారత్ వైపు చూస్తోంది. అసెంబ్లీ ఎన్నికల ముందు తెలంగాణకు రాహుల్ గాంధీ ఆరు గ్యారంటీలు ఇచ్చి వంద రోజుల్లో చేసి తీరతామన్నారు. వాటిని అమలు చేయకుండా ఆయన తెలంగాణకు ఎలా వస్తారు?. హామీలు అమలు చేయలేదు కానీ... పెద్ద పెద్ద ప్రకటనలు, సభలు పెడుతున్నారు" అని కిషన్‌రెడ్డి విమర్శించారు.

# లిక్కర్ స్కాం కేసులో ట్విస్ట్.. కవితకు కొత్త టెన్షన్!

ఢిల్లీ: లిక్కర్ స్కాం కేసులో ఇప్పటికే పలు సంచలనాలు నమోదయ్యాయి. ఈ కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, బీఆర్ఎస? ఎమ్మెల్సీ కవిత తీహార్ జైలులో ఉన్నారు. వారిని ఈ కేసు విషయమై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారిస్తోంది. ఈ నేపథ్యంలో లిక్కర్ కేసులో సీబీఐ విచారణకు అనుమతించడాన్ని వ్యతిరేకిస్తూ కవిత.. రౌస్ అవెన్యూ కోర్టును ఆశ్రయించారు. వివరాల ప్రకారం.. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఎమ్మెల్సీ కవితను ప్రశ్నించేందుకు సీబీఐకి ప్రత్యేక కోర్టు అనుమతినిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో లిక్కర్ కేసులో సీబీఐ విచారణకు అనుమతించడాన్ని వ్యతిరేకిస్తూ కవిత.. రౌస్ అవెన్యూ కోర్టును ఆశ్రయించారు. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కవితను ప్రశ్నించేందుకు సీబీఐకి అనుమతిచ్చిన ప్రత్యేక కోర్టు ఉత్తర్వులను రౌస్ అవెన్యూ కోర్టులో కవిత తరఫు న్యాయవాది నితీష్ రాణా ప్రస్తావించారు. ఈ సందర్భంగా సీబీఐ దరఖాస్తును తమకు అందించలేదని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలోనే కవితను సీబీఐ ప్రశ్నించే అంశంపై విచారణ చేపట్టాలని కోర్టును కోరారు. కవిత పిటిషన్‌పై ఎప్పుడు విచారణ జరుపుతామో ఈరోజు చెప్పాలని విజ్ఞప్తి చేశారు. ఇక, ఈ అంశంలో తన రిప్లై ఇచ్చేందుకు సమయంలో ఇవ్వాలని కోర్టును సీబీఐ కోరింది. దీంతో, సీబీఐ విజ్ఞప్తిని కోర్టు అంగీకరించింది. ఈ క్రమంలో తదుపరి విచారణను ఏప్రిల్ పదో తేదీకి వాయిదా వేసింది. అనంతరం, అప్పటి వరకు స్టేటస్ కో మెయింటైన్ చేయాలని కవిత తరఫు న్యాయవాది కోరారు. వాదనలు విన్న తర్వాతే ఎలాంటి ఆదేశాలైనా జారీ చేస్తామని కోర్టు స్పష్టం చేసింది.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660